సాక్షి అనకాపల్లి

బుధవారం । 4 । జూన్ । 2025



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

ఉష్ణోగ్రతలు

మంగళవారం

గరిష్టం/కనిష్టం

అనకాపల్లి : 36.8/28.1

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు.



అన్నమయ్య పద నర్తనం

సీతంపేట(విశాఖ): అన్నమయ్య 617వ జయంతిని పురస్కరించుకుని పౌరగ్రంథాలయంలో 'అన్నమయ్య పద నర్తనం' జరిగింది.

పెట్టుబడి సాయం ఏదీ..



నాకు నాతవరం మండలం గునిపూడి గ్రామంలో నాలుగు ఎకరాల భూమి ఉంది. గతేడాది నాలుగు ఎకరాల్లోనూ వరి పంట వేశాను. 'అన్నదాత సుఖీభవ' పేరిట ప్రభుత్వం అందిస్తామన్న పెట్టుబడి సాయం అందించకపోవడం, వాతావరణ పరిస్థితులు సరిగ్గా లేకపోవడంతో నష్టం వచ్చింది. ధాన్యం కొనుగోలు దళారుల చేతుల్లో పెట్టడం వల్ల ధర పెంచలేదు. దీంతో బ్యాంక్ నుంచి తెచ్చిన వ్యవసాయ రుణం తీర్చలేకపోయాను. అసలుకు వడ్డీ కలిసి భారంగా మారింది. బ్యాంక్ నుంచి గతంలో తీసుకున్న రుణం చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వకపోతే నాకున్న నాలుగు ఎకరాల్లో సగం మాత్రమే వరి పంట వేస్తాను.

– వి.సూరిబాబు, గునిపూడి, నాతవరం

క్రిమినల్ కేసులు బనాయించి తొలగించారు..



నేను ఎటువంటి అవకతవకలకు పాల్పడకపోయినా.. తప్పులు చేయకపోయినా.. కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నన్ను అన్యాయంగా తొలగించారు. హోం మంత్రి వంగలపూడి అనిత అప్పటి డ్వామా పీడీపై ఒత్తిడి తెచ్చి మరీ నన్ను తీసేయించారు. డ్వామా పీడీ సందీప్‌తో మాకు ఫోన్ చేయించి రాజీనామా చేయాలని చెప్పించారు. నేను చేయనని చెప్పాను. నాపై క్రిమినల్ కేసులు పెట్టి మరీ తొలగించారు. 16 ఏళ్ల ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశాను. మా యాక్ట్ ప్రకారం తప్పు చేస్తే థర్డ్ పార్టీ విచారణ గానీ, క్వాలిటీ కంట్రోల్ విచారణ గానీ చేసి తొలగించాలి. కానీ దానికి విరుద్ధంగా నన్ను విధుల నుంచి తీసేశారు. నాపై ఎందుకింత కక్ష?

– మేకా సోమయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, ఈదటం, పాయకరావుపేట నియోజకవర్గం

భర్త చనిపోయినా పింఛన్ రాలేదు..



ఎస్.రాయవరం మండలంలో హోం మంత్రి క్యాంపు కార్యాలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొరుప్రోలు గ్రామం మాది. నా భర్త చనిపోయి ఏడాదిన్నర అవుతున్నా పింఛన్ మంజూరు కాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఏడాది కాలంలో భర్తలు చనిపోయిన చాలా మందికి పింఛన్ మంజూరు చేశారు. నా భర్త ముందే చనిపోవడం నేను చేసుకున్న పాపమా? 50 సంవత్సరాల వయసులో ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నాను. గత ప్రభుత్వం అందించిన కాపు నేస్తం, డ్వాక్రా నగదు ఎంతో కొంత ఆసరాగా ఉండేది. ఎన్నికల ముందు ఇచ్చిన దరఖాస్తు పరిశీలించేలోగా ఎన్నికలు వచ్చాయి. అవి అయ్యాక ఏడాది కాలంగా నాయకుల చుట్టూ తిరిగినా పింఛన్ మంజూరు కాలేదు.

– దమ్ము సత్యవతి, కొరుప్రోలు గ్రామం, ఎస్.రాయవరం మండలం

వంచన.. వేదన

చంద్రబాబు బృందానికి వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య

అలవి కాని హామీలిచ్చి మాట నిలుపుకోని కూటమి సర్కార్



సాక్షి, అనకాపల్లి: వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య.. నమ్మిన వారిని నట్టేట ముంచడంలో ఘనాపాటీలు.. సూపర్ సిక్స్ మోసం ఫిక్స్ అని జనం గగ్గోలు.. తల్లికి వందనం అంటూ పంగనామాలు పెట్టారు. స్కూలుకు వెళ్లే ప్రతి బిడ్డకూ ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి రెండో ఏట అడుగుపెడుతున్నా ఇంకా ఆ హామీ విద్యార్థుల తల్లిదండ్రులను ఊరిస్తూనే ఉంది. అన్నదాత సుఖీభవ పేరిట ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, నెలకు రూ.1500ల ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. ఇలా హామీలన్నింటినీ తుంగలోకి తొక్కారు. కూటమి ప్రభుత్వ నేతల అరాచకాలను ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించి అణిచివేతకు గురిచేయడం.. లేదంటే వారిపై దాడులు, అడ్డు తొలగించేందుకు హత్యాయత్నాలతో అరాచకం.. జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే కూటమి నేతలు దాడులు, హత్యలు, దౌర్జన్యాలతో బరి తెగించారు. లేటరైట్, ఇసుక, మద్యం, అక్రమ మైనింగ్, గ్రావెల్ మాఫియా చెలరేగిపోతున్నారు. వీధివీధినా బెల్టు షాపులతో విచ్చలవిడి మద్యంతో మహిళలపై దాడులు, చిన్నారులపై అఘాయిత్యాలు ఎక్కువయ్యాయి. కూటమి పార్టీల అధినేతలే కాదు ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా స్థానికంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల ఊసెత్తడం లేదు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన.. అడుగడుగునా దగా దగా అంటూ సామాన్య ప్రజలు వాపోతున్నారు.

ప్రోగ్రెస్ రిపోర్ట్

ఎన్నికల హామీలను నమ్మి ఓట్లేసిన వారికి వంచన..
సంక్షేమ పథకాలు అందక బతుకు భారమై సామాన్యుల వేదన..
వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులని ఏమాత్రం అనిపించినా వారిపై కక్షసాధింపు.. అక్రమ కేసులు..
శాంతిభద్రతలు అదుపు తప్పినా.. నేరాల సంఖ్య పెరుగుతున్నా.. సాక్షాత్తూ హోం మంత్రి సొంత జిల్లాలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా.. ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం..
గ్రావెల్ దోపిడీ, ఇసుక అక్రమ తవ్వకాలు, పైరవీలు, పథకాల పంపిణీలో అధికార పార్టీ నేతల పెత్తనం.. అంతా రాజకీయం..
ఇదీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై సామాన్యుడు ఇచ్చిన ప్రోగ్రెస్ రిపోర్ట్..

లబ్ధిదారుల ఎదురుచూపులు..



- జిల్లాలో 'అన్నదాత సుఖీభవ' కోసం సుమారు 2,65,778 మంది రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది, ఈ ఏడాది కలిపి రూ.1,063 కోట్ల పెట్టుబడి సాయం వారికి అందాల్సి ఉంది.
- ఏడాదికి 2,13,190 మంది విద్యార్థుల తల్లులకు రూ.15 వేలు వంతున రూ.319 కోట్లు అందాలి. రెండేళ్లకు కలిపి రూ.638 కోట్ల బాకీ
- ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున జిల్లాలో 18 ఏళ్లు దాటిన 5,47,888 మంది మహిళలకు 'ఆడబిడ్డ నిధి' ఏడాదికి రూ.986.19 కోట్లు అందించాలి. రెండేళ్లకు రూ.1972.38 కోట్ల బాకీ.
- అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 2.30 లక్షల మంది నిరుద్యోగులు. వారికి రూ.3 వేల వంతున నెలకు రూ.69 కోట్లు, ఏడాదికి రూ.828 కోట్లు ఇవ్వాలి.
- ఉచిత బస్సు ప్రయాణం పథకం కోసం జిల్లాలో 18 ఏళ్లు దాటిన మహిళలు 6,53,505 మంది, 5 నుంచి 18 ఏళ్ల బాలికలు 84,814 మంది ఎదురుచూస్తున్నారు.

సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్

- రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు.. అందరికీ ఆశాభంగం
- అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఏడాది పాలన
- విచ్చలవిడిగా మద్యం విక్రయాలు.. మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు
- 92 మందికి పైగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు
- పెరిగిపోయిన భూకబ్జాలు, దళితులపై దాడులు



అర్హత ఉన్నా పింఛన్ కట్ చేశారు..



నాకు ఒక కన్ను పుట్టుక నుంచి పూర్తిగా కనిపించదు. రెండో కన్ను కూడా మసక మసకగా ఉంటుంది. కూలీ నాలీ చేసుకోలేని పరిస్థితిలో ఉన్నాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ వచ్చేది. ఆ సొమ్ముతో ఇల్లు గడిచేది. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పింఛన్ తీసేశారు. నేను కూలికి కూడా వెళ్లలేకపోతున్నాను. నాకు ఏ కారణంగా పింఛన్ తీసేశారని కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలకు వినతిపత్రాలు ఇచ్చాను. కానీ ఇప్పటివరకూ పింఛను ఇవ్వలేదు.

– వరలక్ష్మి, దివ్యాంగురాలు, పాకలపాడు, గొలుగొండ మండలం

అక్రమ కేసులు.. దాడులు



ఇటీవల నర్సీపట్నంలో హత్యాయత్నానికి గురైన ఈశ్వరరావు

ఏడాది కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై 91 అక్రమ కేసులు పెట్టారు. వైఎస్సార్‌సీపీ నేతలపై హత్యాయత్నాలు, దాడులకు కూడా పాల్పడ్డారు.

- నర్సీపట్నం నియోజకవర్గంలో ఇసుక దోపిడీని అడ్డుకున్నందుకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తోపాటు 44 మందిపై అక్రమ కేసులు బనాయించారు.
- రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ అల్లంపల్లి ఈశ్వర్‌రావుపై రౌడీలతో హత్య చేయించేందుకు కుట్రలు పన్నారు.
- కక్ష సాధింపుతో వైబీ పట్నానికి చెందిన చుక్కా రాంబాబుపై దాడి చేశారు. చిటికెల కన్నపై కేసు నమోదు చేసి ఆయన ఇంటిని కూల్చేశారు.
- నర్సీపట్నం నియోజకవర్గం చీడిగొమ్మల గ్రామంలో టీడీపీ నేతలు దాడి చేసి కొట్టి..12 మంది వైఎస్సార్‌సీపీ యువ నాయకులపై కేసులు నమోదు చేశారు.
- గత ఏడాది జూలై 9న మాకవరపాలెం మండలం ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడుపై 50 మందికి పైగా టీడీపీ గూండాలు కర్రలతో దాడి చేశారు. అడ్డుకున్న కొల్లి అప్పలనాయుడు తమ్ముడు రామారావు, తల్లి సత్యవతి, తండ్రి అప్పారావుపై కూడా కర్రలతో దాడి చేశారు.
- మాకవరపాలెంలో 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని టీడీపీ కార్యకర్త లక్ష్మణ్‌ను వైఎస్సార్‌సీపీ నేతలు మందలించారు. ఈ వీడియోను ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేదీన ఒక టీడీపీ నేత ట్విట్టర్‌లో పెట్టగా వైఎస్సార్‌సీపీ నేతలు రుత్తల సత్యనారాయణ, సర్పంచ్‌లు బొడ్డు గోవిందరావు, మాకిరెడ్డి అయ్యప్ప, పార్టీ నేత బండారు గాంధీపై అక్రమ కేసులు పెట్టి అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. న్యాయస్థానం మొట్టికాయలు పెట్టడంతో తోక ముడిచారు.

హామీలకు తూట్లు..

ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు చెప్పిన సూపర్ సిక్స్‌తోపాటు జిల్లాకు సంబంధించి మరో 143 హామీలు ఇచ్చారు. షరా మామూలుగా విస్మరించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా కూటమి నేతలు స్థానిక అంశాలపై అనేక వాగ్దానాలు చేశారు. వాటికీ అతీగతీ లేదు.

పాయకరావుపేట బహిరంగ సభలో..

ఎన్నికలకు ముందు పాయకరావుపేటలో జరిగిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, వంగలపూడి అనిత అనేక హామీలు ఇచ్చారు. నక్కపల్లి డిగ్రీ కళాశాలకు నూతన భవనాల నిర్మాణం.. చిన దొడిగల్లులో అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి.. ఉద్దండపురంలో అసంపూర్తిగా ఉన్న వాటర్ గ్రిడ్‌కు నిధుల మంజూరు.. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు.. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్.. అడ్డురోడ్డు–నర్సీపట్నం రోడ్డు నిర్మాణం.. కోటవురట్ల మండలంలో రామచంద్రపురం జంక్షన్ నుంచి అడ్డురోడ్డు వరకు రహదారి నిర్మాణం... పాయకరావుపేట టౌన్‌లో మెయిన్ రోడ్డు విస్తరణ అందులో కొన్ని. వీటిలో ఒక్కటి కూడా పూర్తి చేయలేదు.

అనకాపల్లి సభలో..

జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనకాపల్లి సభలో సీఎం రమేష్, కొణతాల రామకృష్ణతో కలిపి పలు హామీలు ఇచ్చారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం.. అనకాపల్లిలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా నూతన భవన సముదాయం నిర్మాణం.. కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు.. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేసి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు.. అనకాపల్లి టౌన్‌లో నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డ్ తరలింపు.. ఆర్ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్ నుంచి విడదీసి మళ్లీ స్వయం ప్రతిపత్తి కల్పిస్తాం.. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ.. వడ్డాది దగ్గర పెద్దేరు నదిపై, విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై వంతెనల నిర్మాణం, రోలుగుంట–వడ్డాది రోడ్డు నిర్మాణం పూర్తి, రావికమతంలో జూనియర్ కళాశాల నిర్మాణం.. అందులో కొన్ని. వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు.

మోసాలను ఎండగడతాం..

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు



సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు చేసిన మోసాలను ఎండగడతామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని ఉత్తరాంధ్రలోని అన్ని నియోజకవర్గాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు.

నాస్కామ్ ఇంటర్న్‌షిప్

మద్దిలపాలెం: నాస్కామ్ ఉచిత ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఏయూ పరిధిలో 50 వేల మంది ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ప్రొగ్రామ్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించి, మాట్లాడారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఏపీ ఉన్నత విద్యా మండలి, ఏయూ సంయుక్తంగా నాస్కామ్ సహకారంతో విద్యార్థులకు ఈ ఉచిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. దీనికి ఈ నెల 7లోగా ఉన్నత విద్యా మండలి పోర్టల్‌లో విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 90526 56967లో సంప్రదించాల్సిందిగా సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ రీజినల్ హెడ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెన్నుపోటు దినం

- కూటమి వంచనను నిలదీద్దాం
- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



మీడియాతో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, జాన్ వెస్లీ

యలమంచిలి రూరల్: వెన్నుపోటు అంటే గుర్తుకు వచ్చేది చంద్రబాబే అని, నాడు ఎన్టీఆర్‌కు.. నేడు సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. మంగళవారం యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, యలమంచిలి సమన్వయకర్త కన్నబాబురాజుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు సర్కారు నయవంచనకు నిరసనగా ఈ నెల 4వ తేదీ బుధవారం వెన్నుపోటు దినం పేరుతో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అడ్డగోలుగా విమర్శలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సైలెంట్ అయిపోయారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల కడపలో నిర్వహించిన మహానాడు ద్వారా మరోసారి ప్రజలను మోసం చేయడానికి చూశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన మేరకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. 2024లో ప్రజలను మోసం చేయడం ఇష్టం లేకనే ఆయన ఆచరణ సాధ్యంకాని హామీలు ఇవ్వలేదన్నారు.

ఎన్నికల హామీలు తుంగలో..

కాళ్లు కడిగి కన్యాదానం చేసిన మామ ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీని, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకుని ఆయనకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు.. సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించారని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ విమర్శించారు. మంగళవారం యలమంచిలి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు, లేదంటే రూ.3 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తానని బాబు చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ సాయం అందక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, సేనాపతి రాము, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా, అచ్యుతాపురం మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు పాల్గొన్నారు.

డిజిటల్ భాగ్యం కలిగేనా? 8లో

భక్తజన జాతర



అమ్మవారి దర్శనానికి ఘటాలతో బారులు తీరిన భక్తులు



మోదకొండమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

అంబరాన్నంటిన మోదకొండమ్మ సంబరం

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, మాడుగుల మోదకొండమ్మ తల్లి జాతరకు జనం పోటెత్తారు. అమ్మ ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం నాటి వేడుకకు ఆలయ కమిటీ గ్రామ పెద్దలు, భక్తుల సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేసింది. అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను నెత్తిన పట్టుకుని అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా భారీ విద్యుత్ లైటింగ్, తప్పెటగుళ్ల, నేలవేషాల నడుమ అమ్మవారి జాతర నేత్రపర్వంగా జరిగింది. శాస్త్రీయ నృత్యాలు, కోలాటాలతో పాటు సూపర్‌డూప్ డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. అమ్మవారి పండుగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ఆర్యవైశ్య మహాసభ సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్‌లో భారీ అన్న సమారాధన నిర్వహించారు. అలాగే మోదకొండమ్మ ఆలయ రహదారిలో విశాఖ డెయిరీ మజ్జిగ పంపిణీ చేసింది. పండుగలో అమ్మవారి శక్తి వేషాలతోపాటు పులివేషాలు, తోలుబొమ్మలాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారిని ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు బత్తుల తాతయ్యబాబు, పీవీజీ కుమార్, కోట్ని బాలాజీ, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ పాలిమేర విజయలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పాటు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

గట్టి పోలీసు బందోబస్తు

స్థానిక ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యంలో సుమారు 150 మంది పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. వాహనాలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. జాతరకు సుమారు లక్షమంది పైగా భక్తులు హాజరవుతారని ముందే అంచనా వేసి అందుకు తగ్గట్టుగా జాగ్రతలు తీసుకొని, ఏర్పాట్లు చేయడంతో అమ్మవారి ఉత్సవం ప్రశాంతంగా ముగిసింది.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 4వ తరగతిలో ప్రవేశానికి 2015 ఏప్రిల్ 1, ఆ తర్వాత జన్మించిన వారు, 5వ తరగతి ప్రవేశానికి 2014 ఏప్రిల్ 1, ఆ తర్వాత జన్మించిన వారు అర్హులు. జనన ధ్రువీకరణ పత్రంతోపాటు, ఏదైనా ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన వారై ఉండాలి. అర్హులైన వారు ఈ నెల 16లోగా http://apsportsschool.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని విశాఖ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన అప్లికేషన్స్ స్క్రీనింగ్ చేసి షార్ట్‌లిస్ట్ చేసిన క్రీడాకారులు వచ్చే నెల 1 నుంచి 3 వరకు నిర్వహించే జిల్లా స్థాయి ఎంపికలకు ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది. వచ్చేనెల 10, 11వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఎంపికలకు పోటీలు నిర్వహిస్తారు.

6 నుంచి చందనం అరగదీత

సింహాచలం: ఈ నెల 6 నుంచి మూడవ విడత చందనం అరగదీత ప్రారంభం కానుంది. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 11న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మూడవ విడతగా సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈ అరగదీతను చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆలయంలో చందనం చెక్కలను అరగదీతకు వీలుగా ముక్కలు చేశారు.

క్లుప్తంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో దొండపూడి విద్యార్థి ప్రతిభ



లీలా గణేష్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

రావికమతం : మండలంలోని దొండపూడి గ్రామానికి చెందిన అడ్డూరి లీలా గణేష్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరిలో 2839 ర్యాంక్ సాధించాడు. లీలా గణేష్ విశాఖపట్నం శ్రీ విశ్వ కాలేజీలో ఇంటర్ చదివాడు. ఇంటర్ ఎంపీసీలో 985 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు అడ్డూరి శ్రీను, సరోజిని సాధారణ రైతు కుటుంబానికి చెందినవారు. లీలా గణేష్ పదో తరగతి వరకు దొండపూడి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 578 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచాడు. అప్పటి వైఎస్సార్ ప్రభుత్వంలో జగనన్న ఆణిముత్యాలు అవార్డును మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చేతుల మీదుగా అందుకున్నాడు. గణేష్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంక్ సాధించడంతో ఆ విద్యార్థిని కాలేజీ అధ్యాపకులు, గ్రామ పెద్దలు అభినందించారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఎస్.రాయవరం: ఆర్థిక సమస్యలు తాళలేక ఒక వ్యక్తి జేవీపాలెం గ్రామంలో ఉరి పోసుకుని మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు మంగళవారం తెలిపారు. విజయవాడలో నివాసం ఉంటున్న వజ్రపు శ్రీనివాసరావు (34) కోర్టు వాయిదా పని మీద స్వగ్రామం జేవీపాలెం వచ్చి ఈ దుర్ఘటనకు పాల్పడినట్టు చెప్పారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ నిర్మాణంలో ఉన్న ఇంటి నిర్మాణం ముందుకు సాగటం లేదని మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని భార్య నాగమణి చెప్పినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పాలగెడ్డ జలాశయంలో జారిపడి యువకుడు మృతి



మృతి చెందిన రోషన్

మాడుగుల రూరల్ : మాడుగులలో జరుగుతున్న మోదమాంబ జాతరకు విశాఖపట్నం నుంచి వచ్చిన యువకుడు పాలగెడ్డ జలాశయంలో కాలుజారి పడి మృతి చెందిన విషాద సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. విశాఖపట్నం అక్కయ్యపాలెం గణేశ్‌నగర్ కాలనీకి చెందిన కె.రోషన్, జయశంకర్, గణేశ్, ఎస్.నవీన్, కలిసి మంగళవారం ఉదయం మాడుగుల సమీపంలో గల పాలగెడ్డ జలాశయంలో దిగారు. వీరిలో రోషన్ కాలుజారి జలాశయంలో పడిపోయాడు. రోషన్‌కు ఈత రాకపోవడంతో జలాశయంలో పడి మృతి చెందారు. మిత్రులు రోషన్ ఆచూకీ కోసం జలాశయంలో గాలించగా, చివరకు రోషన్ విగత జీవిగా కనిపించాడు. యువకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. రోషన్‌మృతితో మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. జాతర రోజున ఇటువంటి సంఘటన జరగడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ భాగ్యం కలిగేనా?



ప్రస్తుతం రోడ్డు పక్కన ఉన్న కాకా హోటల్ దగ్గర నుంచి ఫైవ్‌స్టార్ హోటల్స్, షాపింగ్ మాల్స్, చిన్న చిన్న కూర గాయలు, కిరాణా షాపుల్లో సైతం వినియోగదారులు ఫోన్‌పే, గుగూల్‌పే వంటి యాప్‌లతో చెల్లింపులు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ నగదు రహిత లావాదేవీలకు అలవాటైపోయి కొద్ది మొత్తం నగదుతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అయితే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మాత్రం డిజిటల్ చెల్లింపులు అందుబాటులో లేవు. దీంతో భక్తులు ఒకింత ఇబ్బందులకు గురవుతున్నారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా భక్తులకు సౌలభ్యం కలగడమే కాకుండా.. దేవస్థానం ఆదాయం కూడా గణనీయంగా పెరిగేందుకు ఆస్కారం ఉంది. - సింహాచలం

- అప్పన్న సన్నిధిలో అన్నీ నగదు లావాదేవీలే..
- డిజిటల్ పేమెంట్లు లేక భక్తుల అవస్థలు
- విరాళాల సమర్పణలో నగదు రహిత చెల్లింపులతో మేలు
- తద్వారా భక్తులకు సౌలభ్యం, దేవస్థానానికి ఆదాయం



రాజగోపురం వ్యూ

ప్రస్తుతం సింహాచలంలో దర్శనం టికెట్లు, వివిధ ఆర్జిత సేవల టికెట్లు, ప్రసాదాల కొనుగోలు, కేశఖండన వంటి అన్ని సేవలకు నగదు చెల్లింపు తప్పనిసరి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒడిశా, చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ వంటి సుదూర ప్రాంతాల నుంచి సింహగిరికి భక్తులు తరలివస్తుంటారు. అయితే సరిపడా నగదు వెంట తెచ్చుకోలేనివారి భక్తుల బాధలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు అధికంగా వినియోగించే యువత.. సరిపడా నగదు వెంట తెచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్, బ్యాంకు ఖాతాలో నగదు ఉన్నప్పటికీ.. ఆలయ కౌంటర్ల వద్ద ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి డిజిటల్ చెల్లింపుల సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి క్యూలో నిరీక్షించి.. చివరకు నిరాశకు గురవుతున్నారు. కొండ దిగువన బస్సు టికెట్టు నుంచి కొండపైన ప్రతి అవసరానికీ నగదు కోసం ఇతరులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వస్తే.. ఈ సమస్యలన్నీ తీరుతాయని భక్తులు అంటున్నారు.

దేవస్థానానికి ఆదాయ మార్గం

డిజిటల్ పేమెంట్‌లు అందుబాటులో లేకపోవడంతో దేవస్థానం కొంత ఆదాయం నష్టపోతోందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నిత్యాన్నదాన పథకానికి విరాళాలు అందించాలనుకునే భక్తులు అనేకమంది ఉంటారు. ఈ పథకానికి సంబంధించి ప్రస్తుతం నగదు, చెక్కు, డీడీ రూపంలో విరాళాలు స్వీకరిస్తున్నారు. స్వామికి విరాళం ఇవ్వాలని వారు ముందుగా నిర్ణయించుకుని సింహగిరికి వస్తారు. పై మూడు పద్ధతుల్లో ఏదొకదాన్ని అనుసరించి విరాళం అందజేస్తుంటారు. కాగా.. ఆలయానికి వచ్చిన తర్వాత, స్వామి వారి దర్శనానంతరం లేదా అన్నప్రసాదం స్వీకరించిన తర్వాత తక్షణమే తమకు తోచినంత విరాళం ఇవ్వాలని చాలా మంది భక్తులు భావిస్తుంటారు. అయితే చేతిలో తగినంత నగదు లేకపోవడం, డిజిటల్ చెల్లింపుల సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో వీరు విరాళం ఇవ్వలేక వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం అన్నప్రసాద విభాగం కౌంటర్ వద్ద రోజూ పదుల సంఖ్యలో భక్తులు డిజిటల్ చెల్లింపుల గురించి ఆరా తీస్తున్నారు. డిజిటల్ చెల్లింపులతో చిన్న మొత్తాల నుంచి పెద్ద మొత్తాల వరకు విరాళాలు సులభంగా స్వీకరించే వీలుంటుంది, తద్వారా అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చు. అంతేకాకుండా దర్శనం టికెట్లు, ఇతర సేవల ద్వారా కూడా దేవస్థానానికి పారదర్శకంగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.



అన్నప్రసాదం భవనం వద్ద కౌంటర్‌లో విరాళాలు చెల్లిస్తున్న భక్తులు



సింహగిరిపై ఉన్న రూ.100 టికెట్ కౌంటర్



నగదు చెల్లించి టికెట్లు తీసుకుంటున్న భక్తుడు

ఆధునిక ప్రమాణాలతో..

అయితే డిజిటల్ చెల్లింపుల అమలులో కొన్ని సాంకేతిక సమస్యలు, దుర్వినియోగం జరిగే అవకాశం వంటి అంశాలపై దేవస్థానం వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇవి సహేతుకమైనవే అయినప్పటికీ.. పటిష్టమైన భద్రతా ప్రమాణాలతో కూడిన ఆధునిక సాఫ్ట్‌వేర్‌ను వినియోగించడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చు. భక్తుల సౌలభ్యాన్ని, దేవస్థానం ఆర్థిక ప్రయోజనాలను, లావాదేవీల్లో పారదర్శకతను దృష్టిలో ఉంచుకుని.. సింహాచలం దేవస్థానంలో కూడా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

తోటి భక్తుల వద్ద నగదు తీసుకున్నా..



నా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి దర్శనానికి సింహగిరికి వచ్చా. రూ.300 టికెట్లు మొత్తం ఏడు తీసుకుందామని కౌంటర్ వద్దకు వెళ్లా. ఫోన్‌పే ద్వారా చెల్లిస్తానని చెప్పడంతో అక్కడ లేదన్నారు. దీంతో క్యూ నుంచి బయటకు వచ్చేశా. నగదు కూడా సరిపడినంత చేతిలో లేకపోవడంతో.. సింహగిరిపై పలువురు భక్తులను అడిగి నగదు తీసుకున్నా. వారికి ఫోన్‌పే చేశా.

– శ్రీనివాస్, ఆర్మీ ఉద్యోగి, శ్రీకాకుళం

నా భార్య దగ్గర నగదు ఉండటంతో..



నా కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ నుంచి సింహాచలం వచ్చాను. రూ.300 టికెట్లు మొత్తం ఐదుగురికి తీసుకునేందుకు కౌంటర్ వద్దకు వెళ్లాను. అక్కడ ఫోన్ పే లేదని చెప్పడంతో కంగారు పడ్డాను. చేతిలో నగదు లేదు. అయితే మా ఆవిడ నగదు తీసుకొచ్చింది కాబట్టి ఇబ్బంది తప్పింది.

– ప్రకాష్, కాకినాడ, మార్కెటింగ్ ఉద్యోగి

గంటపాటు ఎదురుచూశా..



నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. చాలా వరకు నగదు రహిత లావాదేవీలు చేయడానికే ఇష్టపడతాను. నాలుగు టికెట్లు తీసుకోవాలని సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయం వద్దకు వెళ్లాను. అక్కడ కేవలం నగదు మాత్రమే ఇవ్వాలని చెప్పడంతో రూ.1,200 నగదు కోసం గంటపాటు ఎదురుచూశాను. చివరికి ఓ భక్తుడు ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నాను. డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి తీసుకురావాలి.

– రంజిత్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాద్

యాప్‌లపైనే ఆధారపడుతున్నారు



ప్రస్తుతం డిజిటల్ పేమెంట్లు చేసేందుకే ఎక్కువ మంది ప్రజలు మొగ్గు చూపుతున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఖాతాలో నగదు ఉంటే ఫోన్ పే, గుగూల్ పే తదితర యాప్‌లు ఉన్నాయన్న ధీమాతో వస్తున్నారు. తీరా వచ్చాక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది మహిళలు, యువతులు ఎవరినీ నగదు అడగలేక తమలో తామే సతమతమవుతున్నారు. డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి తీసుకొస్తే అలాంటి వారికి సౌలభ్యంగా ఉంటుంది.

– బి.శ్రీనుబాబు, గాజువాక

జిల్లాలో 32 శాతం రేషన్ పంపిణీ పూర్తి



పట్టణంలో భీమునిగుమ్మం వీధిలో వృద్ధురాలు ఇంటికి రేషన్ అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి : చౌక ధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమంలో నేటి వరకూ 32 శాతం పంపిణీ పూర్తి చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. స్థానిక 84వ వార్డు కోట్ని వీధి 15 వ నెంబర్ రేషన్ షాపు పరిధిలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, భీమునిగుమ్మం వీధిలో వృద్ధురాలు ఇంటికి రేషన్‌ను ఆమె స్వయంగా వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన కొలతలతో సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. దివ్యాంగులు, కదలలేని స్థితిలో ఉన్నవారికి, వృద్ధులకు ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేయాలని ఆమె కోరారు. డిజిటల్ పేమెంట్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో 1069 రేషన్‌షాపులు ఉన్నాయని, వాటి ద్వారా ఐదు లక్షల ముప్పై వేల కార్డుదార్లకు సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో దివ్యాంగులు, కదలలేని స్థితిలోను, 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు సుమారు 66 వేలు మంది ఉన్నారని, వారందరికీ రేషన్ డీలర్లు ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. రెండు రోజుల లోపల శత శాతం పంపిణీ పూర్తి చేయవలసిందిగా అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ప్రతి నెల 5వ తేదీ లోపల మధ్యాహ్నం 12 నుండి 4 గంటల సమయంలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఈ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు జాబితా అందరి రేషన్ డీలర్ల వద్ద ఉందని వారికి ఇంటి దగ్గరే సరుకులు పంపిణీ జరుగుతుందని తెలియజేశారు. రేషన్ సరుకుల పంపిణీలో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, జిల్లా సరఫరా అధికారి కె.ఎల్.ఎస్ మూర్తి, తహసీల్దార్ విజయ్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయిస్తా

మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అసహనం

యలమంచిలి రూరల్: మూడు నెలలకొకసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు హాజరు కాని సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయిస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జరిగిన యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన సమావేశానికి మండలంలో మెజార్టీ పంచాయతీల సర్పంచులు హాజరు కాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. లైనుకొత్తూరు, జంపపాలెం, షేకిళ్లపాలెం, తురంగలపాలెం, పురుషోత్తపురం, కొత్తలి, పద్మనాభరాజుపేట, ములకలాపల్లి, పులపర్తి పంచాయతీల సర్పంచ్‌లు సమావేశానికి రాలేదు. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో వారి చెక్ పవర్ రద్దుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం పలు శాఖల అధికారుల ప్రగతి నివేదికలపై సుదీర్ఘ సమీక్ష జరిగింది. ప్రజాప్రతినిధులు సమావేశాలకు హాజరై ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రాజాన శేషు, ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ కె.వరహాలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

గొలుగొండ: మండలంలో అమ్మపేట గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. అమ్మపేట గ్రామానికి చెందిన జయ (25) కుమారుడు విష్ణున్ష్ (16 నెలలు)ను తీసుకొని మే 3వ తేదీన ఇంటి నుంచి వెళ్లిందని, అన్ని ప్రాంతాల్లో వెతికినా ఇప్పటి వరకు ఆచూకీ తెలియలేదని జయ భర్త శివనాగ గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

కమాండెంట్ మురళీకృష్ణకు ఘనంగా వీడ్కోలు

పీఎంపాలెం: ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కేవీ మురళీకృష్ణ తిరుమల దేవస్థానం చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం బక్కన్నపాలెం బెటాలియన్ ఆవరణలో ఆయన వీడ్కోలు సభ జరిగింది. స్థానిక అధికారులు, సిబ్బంది కమాండెంట్ మురళీకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ టీటీడీ సీవీఎస్‌వోగా బదిలీ కావడం, శ్రీవారి సన్నిధిలో సేవ చేసే అవకాశం లభించడం మహాభాగ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాకుళం 1వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం మురళీకృష్ణ నిరంతరం కృషి చేశారని కొనియాడారు. కేజీహెచ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్పా మురళీకృష్ణ, ఇన్‌చార్జి అదనపు కమాండెంట్ పి.సత్యం, సహాయ కమాండెంట్లు ఎస్.మురళీధర్, వి.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

కాపులకు చంద్రబాబు వెన్నుపోటు

- రాజకీయంగా అణగదొక్కే కుట్ర
- తుని రైలు కేసు రీ ఓపెన్ చేసేందుకు కంకణం
- పవన్ కల్యాణ్‌ను కూడా ఏదో రోజు జైలుకి పంపిస్తాడు
- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం



నక్కపల్లి: కాపుల ఓట్లతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న విషయం మర్చిపోయి తిరిగి కాపులకే వెన్నుపోటు పొడిచేందుకు చంద్రబాబునాయుడు సిద్ధపడుతున్నారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ తునిలో జరిగిన రైలు దగ్ధం కేసును తిరిగి తెరిపించి కాపు ఉద్యమకారులను జైలుకి పంపించాలనే కుట్రకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. తుని ఘటనకు సంబంధించిన కేసులను రైల్వే కోర్టు కొట్టివేసిందని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపు ఉద్యమకారులపై టీడీపీ ప్రభుత్వంలో పెట్టిన కేసులు ఎత్తివేసిందన్నారు. ఈ కేసులను తిరిగి విచారణ చేపట్టే విధంగా హైకోర్టులో అప్పీలు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. కాపు జాతిని, కాపు నాయకులను పూర్తిగా అడ్డు తొలగించుకోవాలనే కుట్రతోనే చంద్రబాబు, లోకేష్‌లు ఈ చర్యలకు ఒడిగడుతున్నారని మండిపడ్డారు. కాపులకు రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం చంద్రబాబు ప్రభుత్వానికి లేదన్నారు. దీనిలో భాగంగా ఉద్యమ సమయంలో కేసులను తిరగదోడి భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని, వారి సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని గతంలో జరిగిన ఉద్యమాల్లో అన్ని రాజకీయ పార్టీ నాయకులు ఉన్నారన్నారు. వీరందరిపై కక్ష కట్టి వేధిస్తే భవిష్యత్‌లో తమకు ఎదురు తిరగరన్న ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు కేసులు రీ ఓపెన్ చేసేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. జనసేన పార్టీ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చంద్రబాబునాయుడు ఏదో రోజు పవన్ కల్యాణ్‌పై కేసులు పెట్టించి జైలుకు పంపినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. కాపులపై పెట్టిన కేసులు తిరగదోడాలని చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై పవన్ కల్యాణ్ స్పందించాలన్నారు. పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని నమ్మి కాపులంతా గంపగుత్తుగా కూటమి పార్టీలకు ఓట్లేసి గెలిపించి అధికారాన్ని కట్టబెట్టారన్నారు. చంద్రబాబు లోకేష్‌లు చేస్తున్న కుట్రలపై జనసేన పార్టీతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్టీల్లో ఉన్న కాపు నేతలు గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఉపసర్పంచ్ వీసం రాజు, పార్టీ నాయకులు ముద్దా శ్రీను, అల్లాడ కొండ, దేవవరపు వెంకటసత్యనారాయణ, పోతంశెట్టి బాబ్జీ, అల్లాడ కొండ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ



సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సోమరాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలోని ఎస్-3 స్పోర్ట్స్ ఏరీనా వేదికగా జరుగుతున్న హండ్రెడ్ ఎస్3 ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది క్రీడాకారులు అండర్ 11, 13, 15, 17 ఏళ్ల కేటగిరీల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఇండియన్ ఆయిల్ సీనియర్ మేనేజర్ చైతన్య, శ్రీనివాస్, కార్పొరేటర్ ఉషశ్రీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వి.వి.సోమరాజును సత్కరించారు. స్పోర్ట్స్ ఏరీనా నిర్వాహకుడు సహాని తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థుల అ‘పూర్వ’ కలయిక



అపూర్వ కలయిక పేరుతో కలుసుకున్న పూర్వ న్యాయ విద్యార్థులు

మూడు దశాబ్దాల తరువాత మళ్లీ చౌడువాడలో కలుసుకున్న పాత మిత్రులు

కె.కోటపాడు: విశాఖపట్నంలో న్యాయ విద్యాపరిషత్ లా కళాశాలలో 1993లో చదువులు సాగించిన పూర్వ విద్యార్థులు చౌడువాడలో అపూర్వ కలయిక పేరుతో కలుసుకున్నారు. మూడు దశాబ్దాల తరువాత కలిసిన నాటి స్నేహితులంతా ఒక్కచోట చేరి గత స్మృతులను నెమరువేసుకున్నారు. అల్లరి చేష్టలను తలచుకొని రోజంతా సంతోషంగా గడిపారు. వారి కుటుంబాల యోగక్షేమాలను ఒకరికి ఒకరు తెలుపుకున్నారు. ఈ అపూర్వ కలయికకు చోడవరం న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ సారథ్యం వహించారు. వివిధ ప్రాంతాల్లో న్యాయవాద వృత్తి నిర్వహిస్తున్న వారు, న్యాయ శాఖలో వివిధ హోదాల్లో స్థిరపడిన వారు ఈ సమావేశానికి హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బుచ్చెయ్యపేట: పోలేపల్లి గ్రామానికి చెందిన యువకుడు సేనాపతి పవన్‌కుమార్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం వడ్డాదిలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇతను కుక్కను తప్పించబోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్‌కు తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆయన విశాఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బొగ్గు లారీ బీభత్సం

నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



నుజ్జు నుజ్జు అయిన ఆటో ముందుభాగం



లంకెలపాలెం కూడలిలో బీభత్సం సృష్టించిన బొగ్గు లారీ

పరవాడ: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో మంగళవారం ఉదయం ఓ బొగ్గు లారీ బీభత్సం సృష్టించింది. విశాఖ పోర్టు ట్రస్టు నుంచి అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌కు వెళ్తున్న బొగ్గు లారీ ఉదయం 6.45 గంటల సమయంలో అతి వేగంగా వచ్చి ముందున్న కారును, ఆటోను ఢీకొట్టింది. అనంతరం సిగ్నల్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని నిలిచిపోయింది. ప్రమాదంలో కారు వెనుక భాగం దెబ్బతినగా, ఆటో ముందు భాగం నుజ్జయింది. ఆటోలో ఉన్న సీతారాములు, నాగలక్ష్మి, ఆదిలక్ష్మి, దేముడమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను అగనంపూడి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మిని మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో సిగ్నల్ విద్యుత్ స్తంభం, హైమాక్స్ లైట్, రెయిలింగ్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉదయం సమయంలో రోడ్డుపై పెద్దగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ కృష్ణారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బొగ్గు లారీని క్రేన్ సహాయంతో బయటకు తీసి.. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13756]

సాక్షి క్లాసిఫైడ్స్
లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/-
అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

Wanted

■ Wanted 5th & 6th Maths, Teacher, Wonworld School, 4-47-7, Lawsonsbay Colony, Pedawaltair, VSP. Ph : 98482 37187, 82351 23123 [V- 13882]

■ Wanted Field Executives to work in banking sector (Collections) Good Salary+incentives + Petrol. Contact: 93911 94852, 74169 66423. [SCA25004519]

■ GUSM ఎడ్యుకేషనల్ సర్వీస్ సెంటర్‌లో పనిచేయుటకు (M/F) టెలికాలర్స్ కావలెను. వ: 35 సం॥లోపు. భాష: తెలుగు, ఇంగ్లీష్, హిందీ. ఇంటర్వ్యూ: 8-6-2025. 11 AM.✆ 88861 90901. [SCA25004514]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ

అనకాపల్లి: కూటమి అధికారం చేపట్టి ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలను బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అమలు చేయకపోవడంతో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఇక్కడ నుంచి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్, వన్‌వే ట్రాఫిక్ డౌన్, పెరుగుబజార్ జంక్షన్, వేల్పులవీధి జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వెన్నుపోటు దినం తలపెట్టామన్నారు.

కొబ్బరి చెట్టుపై నుంచి జారిపడి యువకుడి మృతి



మృతుడు కొల్లి రాజు

అచ్యుతాపురం రూరల్: మండలంలో జంగులూరు గ్రామానికి చెందిన కొల్లి రాజు (34) కొబ్బరి చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు. అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలో తన అత్తమామల ఇంటి దగ్గర సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కొబ్బరి కాయలు తీసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడటంతో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక పాప ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు అచ్యుతాపురం పోలీసులు తెలిపారు.

ఉపాధి కార్మికుల నిరసన



గొర్లివానిపాలెం పని ప్రదేశంలో ఆందోళన చేస్తున్న ఉపాధి కార్మికులు

పరవాడ: ఉపాధి హామీ పథకం కార్మికులకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాల విడుదల కోసం సిటు ఆధ్వర్యంలో గొర్లివానిపాలెం పని ప్రదేశంలో ఉపాధి కూలీలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 8 వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పని ప్రదేశంలో మంచినీరు, మజ్జిగ సరఫరా చేయాలన్నారు. తట్ట, పార, గునపాంలకు డబ్బులు చెల్లించాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 118 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,000	4,950
రెండో రకం	3,610	4,120
మూడో రకం	3,100	3,700

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
ఖలేజా	:సత్యనారాయణస్క్రీన్-1
కరాటే కిడ్-లిజెండ్స్	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
సింగిల్	:షిర్డీసాయి
ఏసీఈ	:వెంకటేశ్వర
శుభం	:శ్రీసత్య
షష్టిపూర్తి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-10, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 355 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఎంపీగా గెలిపించాం.. పరిశ్రమలేవీ?

అనకాపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే జిల్లాకు వివిధ పరిశ్రమలు తీసుకువచ్చి వేలల్లో ఉద్యోగాలు కల్పిస్తానని, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం రమేష్ ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదు. గ్రామీణ జిల్లా కావడం, నిరుద్యోగంతో అల్లాడుతున్న యువత అతడి మాటలు నమ్మి ఓట్లేసింది. తీరా గెలిచిన నాటి నుంచి అడపాదడపా ఆలయాల దర్శనాలు, ప్రారంభోత్సవాలకు మాత్రమే కనిపిస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటు గురించి పట్టించుకోలేదు. జిల్లాలో ఏడు నియోజకవర్గ పరిధిలో లక్షలాది మంది యువతీ యువకులు ఉన్నారు. వారందరూ జిల్లాకు ఎప్పుడు పరిశ్రమలు వస్తాయోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి స్థానికేతరుడైన ఎంపీ రమేష్‌కు ఇక్కడ ఎలాంటి బలం లేదు. కానీ అతని గెలుపులో హామీలే కీలకమయ్యాయని ఈ ప్రాంత వాసులు చెబుతున్నారు. తనకు వివిధ ప్రముఖులతో పరిచయాలు ఉన్నాయని, ప్రధానమంత్రితో మంచి సత్సంబంధాలు ఉన్నాయని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీలు గుప్పించి ఇప్పుడు పట్టించుకోవడం లేదని నియోజకవర్గ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ యార్డు హామీ ఏమైంది?

అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఎన్నికల ముందు పలు హామీలతో ఊదరకొట్టారు. అందులో ముఖ్యంగా దశాబ్దంపైగా ఇబ్బంది పడుతున్న డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. గెలిచి ఏడాది కావస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం ఆ ప్రయత్నమైనా చేసిన సందర్భం లేదు. మచ్చలేని సీనియర్ నాయకుడని నమ్మి జనం ఓట్లేశారు. తీరా గెలిచాక హామీని పక్కన పెట్టారు. దీని గురించి అధికారులతో సమీక్షించిన సందర్భం లేదు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలోనే ఉన్న డంపింగ్ యార్డును అసలు తరలిస్తారా, కాలం గడిపేస్తారా అనేది స్పష్టత లేదు.

ఏడాది పాలనంతా మోసం

- పరిశ్రమలు లేవు.. ఉద్యోగాల కల్పన ఉత్తుత్తిదే
- గ్రోయిన్లను పట్టించుకోలేదు
- తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూడలేదు
- అటకెక్కిన ఎమ్మెల్యే, ఎంపీ వాగ్దానాలు



పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డు

అనకాపల్లి/అనకాపల్లి టౌన్: దగాకోరు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయింది. ఈ ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. స్థానిక ఎంపీ సీఎం రమేష్‌గానీ, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చారంటే అదీ లేదు. కనీసం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్న పాపానపోలేదు. అనకాపల్లి జోనల్ కార్యాలయంలో వద్ద ఏర్పాటు చేసిన కంపోస్టు యార్డును తొలగిస్తామని, పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని, గ్రోయిన్లు బాగుచేస్తామని, నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో అనకాపల్లి ఎంపీ మోసపూరిత హామీలిచ్చి ప్రజలను మోసం చేశారు.

దారుణంగా గోతులతో రోడ్లు



రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల గోతులను పూడ్చిస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు చెప్పి ఏడాదవుతున్నా పట్టించుకోలేదు. సంక్రాంతిలోపు రహదారుల మరమ్మతులు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు నోరు మెదపడం లేదు. అనకాపల్లి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే రహదారులు పరిస్థితి దారుణంగా ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– సూదికొండ మాణిక్యాలరావు, నియోజకవర్గ కన్వీనర్, బీఎస్పీ

డంపింగ్ యార్డు తరలిస్తారా లేదా?



పట్టణంలో నడిబొడ్డున జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద 12 ఏళ్ల క్రితం డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. దీనివల్ల నుంచి వెలువడే దుర్వాసనతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గత ఎమ్మెల్యేలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ డంపింగ్ యార్డు చుట్టూ షెడ్ నిర్మాణం చేసి ఏడాది తర్వాత తరలిస్తామని ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయలేదు.

– పాత్రపల్లి వీరుయాదవ్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు, అనకాపల్లి

హామీలిచ్చి కనిపించకుండా పోయిన ఎంపీ



మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి పాలనలో రైతుల ఆత్మహత్యల్లో అనకాపల్లి నియోజకవర్గం రెండో స్థానంలో ఉంది. బాధిత కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలి. నియోజకవర్గంలో గ్రోయిన్‌లకు మరమ్మతులు చేయిస్తామని చెప్పి ఏడాదిగా పట్టించుకోలేదు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని, ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిన ఎంపీ సీఎం రమేష్ గెలిచిన తర్వాత ప్రజలకు కనిపించకుండా పోయారు.

– బాలు గాడి, రాష్ట్ర కో–కన్వీనర్, రైతు స్వరాజ్య వేదిక

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

- చర్యలు తీసుకోవాలని వినతి



సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

అనకాపల్లి: పట్టణంలో రాత్రి సమయంలో విద్యుత్ కోతలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక గవరపాలెం విద్యుత్ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ గుబ్బల ప్రసాద్‌కు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో విఫలమైనట్లు పేర్కొన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం వల్ల వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, ఇతర వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బొడ్డేడ అప్పారావు, కొల్లు చిన్న అప్పారావు, ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజు, వాసుపల్లి తాతయ్యలు, దాడి నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో మెరుగైన దిగుబడులు

జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు

మునగపాక: సేంద్రియ సాగుపై రైతులు దృష్టి సారించాలని, తద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త నిర్వహణలో కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. భూసార శాస్త్రవేత్త శ్రీహరిరావు మాట్లాడుతూ సహజ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. మట్టి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయరాణి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువుల పోషణ, పశు గ్రాస సాగులో యూరియా వాడకంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ



మలేరియా నిర్మూలనపై వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య, ఆరోగ్య సిబ్బంది మలేరియా వ్యాధిపై అవగాహన కలిగిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ మలేరియాకు దోమలు కారణమన్నారు. ఇళ్ల పరిసరాల్లో దోమలు అభివృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వారానికి ఒక రోజు పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా డ్రై డే పాటించాలన్నారు. దోమతెరలు వాడటం వల్ల మలేరియాను అరికట్టవచ్చునన్నారు. ఎవరికైనా తీవ్రమైన చలితో జ్వరం, తలనొప్పి, వాంతులు అవుతుండటం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించుకొని వ్యాధి ఉన్నచో ఉచిత వైద్య సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చి ఏడాది?



కశింకోటలో గవరపేట వద్ద శారదా నదిపై నిర్మించాల్సిన వంతెన ప్రాంతం



దోనెలపై నదిని దాటుతున్న రైతులు

- కన్నెత్తి చూడని ఎమ్మెల్యే, స్పీకర్
- శారదా నదిపై ప్రమాదకర ప్రయాణం

కశింకోట: స్థానిక గవరపేటలో శారదానదిపై అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చి ఏడాదవుతున్నా పట్టించుకోలేదు. దీంతో రైతులు కూటమి ప్రభుత్వ పాలనను నిరసిస్తున్నారు. గవరపేట ప్రాంత ప్రజల పొలాలు అత్యధికంగా శారదానది అవతల ఉండటం, పశువుల శాలలు ఉన్నాయి. దాంతో నిత్యం దోనెలపై నదిని దాటి వ్యవసాయ కార్యకలాపాలు, పశువుల పాలు సేకరించి సంరక్షణ పనులు సాగించుకుంటుంటారు. నది ప్రవాహం ఎక్కువైనా, వాతావరణం అనుకూలించకపోయినా దోనెలపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంటుంది. 1977 వరదలు తర్వాత దోనెలు మునిగి ఇద్దరు మృతి చెందారు. ఆ తర్వాత పలు దఫాలు నదిలో మునిగి రైతులు మృతి చెందడం, ప్రమాదాల నుంచి బయట పడటం వంటి సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ వంతెన నిర్మించాలని చాలా కాలంగా అధికారులు, ప్రజా ప్రతినిధులను రైతులు కోరుతూ వచ్చారు. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.70 కోట్లతో వంతెన నిర్మాణాన్ని 2020లో చేపట్టారు. దీనిలో భాగంగా 9 స్తంభాలను భూస్థాయి వరకు కాంక్రీట్‌తో ఏర్పాటు చేశారు. ఇంతలో కరోనా రావడం, నదిలో నీరు నిల్వ ఉండిపోవడం తదితర కారణాల వల్ల వంతెన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి ఇక ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కూడా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడితోపాటు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో వంతెన నిర్మాణం పూర్తి చేయడానికి హామీ ఇచ్చారు. ఈ పనులు మాత్రం చేపట్టలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు శారదానది నీటి ప్రవాహం అధికమైతే దోనెలు నిలిచిపోయి గ్రామ శివారులో దూరంగా వంతెన మీదుగా మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి వ్యవసాయ కార్యకలాపాలు, పశువుల సంరక్షణ సాగించుకోవలసి వస్తోందని వాపోతున్నారు. ఒక్కొక్కసారి దోనెలు మునిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా గత్యంతరం లేక బిక్కుబిక్కుమంటూ ప్రాణభయంతో నదిని దాటాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. దీనిదృష్ట్యా ఇకనైనా వంతెన నిర్మాణం పూర్తి చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇకనైనా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌ఈసీఎస్‌పైనా అంతే..

కశింకోట: స్థానికంగా గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్)ను గతంలో వలె యధావిధిగా కొనసాగించేందుకు చర్యలు చేపడతామని సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. అది పూర్తి స్థాయిలో నెరవేరలేదు. గతంలో ఈ సంస్థను ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేశారు. ప్రస్తుతం పేరుకే ఆర్‌ఈసీఎస్ ఉంది తప్ప పూర్తి పెత్తనం ఏపీఈపీడీసీఎల్ కొనసాగిస్తోంది. విద్యుత్ పంపిణీ, నిర్వహణ, అభివృద్ధి పనులు, విద్యుత్ బిల్లుల వసూలు, జమ, సిబ్బందికి జీతాలు చెల్లింపు ఏపీఈపీడీసీఎల్ ద్వారానే జరుగుతున్నాయి. 460 మంది ఉద్యోగులు, సిబ్బంది, లక్షా 90 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్న సంస్థను గతంలో వలె ఈపీడీసీఎల్‌తో సంబంధం లేకుండా ఆర్‌ఈసీఎస్‌గా కొనసాగించాలని ఉద్యోగులు, వినియోగదారులు కోరుతూ వస్తున్నారు. అయినా అది నెరవేరకపోవడంతో నిరసన వ్యక్తమవుతోంది.

రేషన్ కష్టాలు షరామామూలే..

- తరచూ మొరాయిస్తున్న సర్వర్
- గంటల కొద్దీ కార్డుదారుల నిరీక్షణ
- దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు అందని రేషన్
- డిపోలకు వెళ్లలేక అవస్థలు



కశింకోటలో సర్వర్లు సరిగా పని చేయక రేషన్ డిపోలో ప్రజలు

కశింకోట: మండలంలో మూడో రోజు మంగళవారం కూడా రేషన్ దుకాణాల్లో ప్రజలకు కష్టాలు తప్పలేదు. సర్వర్ సరిగ్గా పని చేయక ఎక్కువ సమయం నిరీక్షించడం, లేదంటే ఇంటికి వెళ్లిపోయి మళ్లీ రాక తప్పని పరిస్థితిని ఎదుర్కొన్నారు. కశింకోటలో రెండు రోజులతో పోల్చుకుంటే ఉదయం 11 గంటల వరకు కాస్త సర్వర్లు పని చేసి, ఆ తర్వాత సక్రమంగా పని చేయలేదు. కొందరి వేలిముద్రలు సరిగ్గా పడలేదు. దీంతో ఇబ్బందులు తప్పలేదు. తమ పేరు ఏ డిపోలో ఉందో తెలియక ప్రజలు తికమక చెంది పలు డిపోలకు కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఏ రేషన్ డిపోలో అయినా సరుకులు తీసుకోవచ్చునని ఒక వైపు ప్రభుత్వం, మంత్రులు చెబుతుండగా, ఇక్కడ మాత్రం పేరు ఉన్న సంబంధిత డిపోకు వెళ్లి సరుకులు తీసుకోవాలని పంపించివేస్తున్నారు. దీంతో లబోదిబోమంటూ ఎండన పడి ఆయా డిపోలకు వెళ్లాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు.

దివ్యాంగులకు, వృద్ధులకు తప్పని కష్టాలు

వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు తెచ్చి రేషన్ అందిస్తామని ప్రభుత్వం పేర్కొంటుండగా అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. దీంతో వారు తమకు రేషన్ అందుతుందా? లేదా? అని మదన పడుతూ డిపోల చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఇంటికి అందిస్తారని, డిపోల్లో ఇవ్వబోమని అక్కడికి వచ్చిన వారికి డీలర్లు తెలపడంతో వారి నిరాశతో వెనుదిరిగారు. ఇక సాయంత్రం డీలర్లకు సమావేశం ఉందని రేషన్ సరుకుల సరఫరాను నిలిపి వేశారు. దీంతో పలువురు రేషన్ కోసం డిపోలకు నడచి వెళ్లి అక్కడ ఇవ్వకపోవడంతో ఈసురోమంటూ ఇంటి ముఖం పట్టాల్సి వచ్చింది. ఇదే విధంగా మండల గ్రామాల్లోని రేషన్ డిపోల వద్ద కూడా ప్రజలు ఎక్కువ సమయం నిరీక్షిస్తూ ఇబ్బంది చెందారు.

రేషన్ ఎప్పుడిస్తారో..



కోటా బియ్యం కోసం రేషన్ దుకాణానికి వెళితే బియ్యం ఇవ్వలేదు. నాకు 83 సంవత్సరాలు వయస్సు ఉండటంతో ఇంటికి వచ్చి అందిస్తామని చెప్పి డీలర్లు పంపివేశారు. దీంతో నిరాశతో ఇంటికి వెను తిరగాల్సి వచ్చింది. ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.

– గొంతిన చెల్లయ్యమ్మ, కస్పావీధి, కశింకోట

ఇతర డిపోలో బియ్యం ఇవ్వలేదు

మాకు కేటాయించిన డిపో వద్దకే వెళ్లి కోటా బియ్యం తీసుకోవాలని సరుకులు ఇవ్వకుండా ఇతర డిపోల నుంచి పంపివేశారు. సరుకులు ఏ డిపోలో అయినా ఇస్తారని అధికారులు అంటున్నారు. అయితే ఇక్కడ మాత్రం ఇవ్వకపోవడంతో మాకు కేటాయించిన డిపో తెలుసుకొని వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది.

–బుద్ద నాగమణి, కశింకోట

సర్వర్లు సరిగా పని చేయడం లేదు



సర్వర్లు సరిగా పని చేయక పోవడం, వేలిముద్రలు పడకపోవడం వల్ల కోటా బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోంది. దీనివల్ల ఇబ్బంది పడకుండా సర్వర్లు సరిగ్గా పని చేయించి రేషన్ అందివ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–అప్పారావు, కశింకోట

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి కోర్టు రూ.66 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. మంగళవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వరి విత్తన రకాల ఎంపిక కీలకం

అనకాపల్లి: నేలను దున్ని విత్తడానికి అనుకూలమైన ఎంటీయూ 1262,1315, 1224, ఆర్‌జీఎల్ 2537 వంటి వరి రకాలను ఎంపిక చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సజ్జ వేసే రైతులు హైబ్రీడ్ రకాలను, కొర్రను వేసేవారు స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు, నేలను దున్ని వరి నారుమడులు తయారు చేసుకోవాలని సూచించారు. వరి మాగాణుల్లో జనుము, జీలుగ, పిల్లిపెసర, పెసర లాంటి పచ్చిరొట్ట వేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట పెంచి నేలలో కలియ దున్నటం ద్వారా భూసారం పెరగడం, 20–25 శాతం నత్రజని, భాస్వరం, పొటాష్‌లను ఆదా చేయవచ్చన్నారు. శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరీ, సీతారామలక్ష్మి, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

'పవర్ గ్రిడ్' అభివృద్ధికి యువ ఇంజినీర్లు కీలకం



వాల్వ్ హాల్ రోబోట్‌ను ప్రారంభిస్తున్న పీజీసీఐఎల్ డైరెక్టర్ నవీన్ శ్రీవాస్తవ్

పరవాడ: పవర్ గ్రిడ్ అభివృద్ధికి యువ ఇంజినీర్లు దోహదపడాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(పీజీసీఐఎల్) ఆపరేషన్స్ డైరెక్టర్ నవీన్ శ్రీవాస్తవ్ పిలుపునిచ్చారు. ఉక్కునగరంలోని హెచ్‌వీడీసీ ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన వాల్వ్ హాల్ రోబోట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రానున్న రోజుల్లో పవర్ గ్రిడ్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త గ్రిడ్ కోసం రూ.3 వేల కోట్లను ఖర్చు చేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. పవర్ గ్రిడ్‌లో ఏర్పాటు చేసిన వాల్వ్ హాల్ రోబోట్ అత్యంత విలువైన ఆవిష్కరణగా అభివర్ణించారు. చీఫ్ ఇంజినీర్ సంతోష్ మాట్లాడుతూ మానవ జోక్యం లేకుండా లోపల ఏ విధమైన ప్రమాదం జరిగినా ఈ రోబోట్ గ్రహిస్తుందన్నారు. సాంకేతిక సమాచారం తెలియజేస్తుందన్నారు. సీజీఎంలు, సీనియర్ జీఎంలు, మేనేజర్లు, పవర్ గ్రిడ్ అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు

మునగపాక: పాడి రైతులకు మెరుగైన సేవలందిస్తున్నామని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కోరారు. స్థానిక తులసీ కల్యాణ మండపం ప్రహరీ నిర్మాణానికి ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ తులసీ కల్యాణ మండపం నిర్వహణపై సొసైటీ సభ్యులు దృష్టి సారించాలన్నారు. డెయిరీ ద్వారా కొంత నగదును ప్రహరీ నిర్మాణానికి అందజేస్తామన్నారు. పాల సంఘం అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, రైతులు పాల్గొన్నారు.

పూడిమడక తీరాన యోగాంధ్ర



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకారులు

అచ్యుతాపురం రూరల్: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రోజూ యోగా చేసినట్లయితే ఎటువంటి అనారోగ్య సమస్యలు దరి చేరవని పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామం పూడిమడక తీరంలో జిల్లా మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో 500 మంది మత్స్యకారులతో యోగాంధ్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. యోగా అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎఫ్‌వో ప్రసాద్, ఫిషరీస్‌షేడీ షేక్ జాస్మిన్, మత్స్యశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

